# తొండల మహాసభ

డా॥ పులిపాటి గురుస్వామి

కథ

***"ఊరికే 'తౌస' పెట్టకు నిన్ను గూడ తీసుకపోత" అనేసరికి బాల తొండ ఆనందంగా తోకను గాల్లోకి విదిలించింది.***

***ఆరోజు జరిగే తొండల మహాసభకు ఊరునుండి లారీలో తొండలన్నీ బయల్దేరడానికి సన్నద్ధమవుతున్నాయి.***

***బాల తొండకు ఎన్నాళ్లనుంచో హైదరాబాద్ చూడాలని వుంది. అక్కడ బంధువులు గానీ, దోస్తులు గానీ లేకపోవటం వల్ల తమ తల్లిదండ్రులు కూడా ఎప్పుడూ వెళ్లకపోవడం వల్ల బాలతొండకు అలాంటి అవకాశం చిక్కలేదు.***

ఇంత కాలానికి తమకు జరుగుతున్న అన్యాయాల గురించి చర్చించుకోవడానికి తొండల మహాసభ జరుగుతుంది. తండ్రి తొండ వెలుతున్నాడని తెలియగానే బాలతొండ వెంటబడింది. దాని 'తౌస' భరించలేక '(మనుషులు 'నస' పెడతారు) సరేనని ఒప్పుకున్నాడు.

** ** **

రాష్ట్రం నలుమూలల నుండి అశేష 'తొండల వాహిని' బయలుదేరింది.

ఒకటా, రెండా అమ్మో...! ఎన్ని వందల లారీల తొండలు. ఆడ, మగ, ముసలి, ముతక, యువక, బాల తొండలు... లారీలు, జీపులు 'బలమైన' తొండలు టూరిస్టుల్లో, హైటెక్ బస్సుల్లో, కొన్ని తొండలు ట్రాక్టర్లలో వచ్చాయి.

తొండల సభను జయప్రదం చేయండంటూ పెద్ద పెద్ద అక్షరాలతో బ్యానర్లు కట్టారు. కొన్ని లారీల మీద మైకులు పెట్టి తొండల పాటలు వేశారు. తొండ నృత్యాలతో సభకు చేరుకున్నారు.

మన బాల తొండకు మతిపోయింది, తండ్రి తొండకు భయమేసింది. ఒక అనుమానం కూడా వచ్చింది. తమను తీసుకువెళ్లేటపుడు అందరికీ పిడికెడు పురుగుల్ని పెడతామని హామీ ఇచ్చారు తమ నాయకులు. తిన్నంత తిని కొంత మూట కట్టుకోవచ్చని అనుకుంది. పన్లో పనిగా బాల తొండ వెంట ఉంటే మరిన్ని పురుగులు తమకు దొరుకుతాయని అనుకుని వెంటబెట్టుకొచ్చింది. ఇక్కడ చూస్తే ఇదీ పరిస్థితి.

ఇంతమంది తొండల తిండికి ఎన్ని పురుగుల్ని సప్లయ్ చేస్తారు? అసలే హైదరాబాదులో పురుగుల కొరత, మంచినీళ్ల కొరత, మనుషులకే నీళ్లు లేవు. ఎలా...? అని మధన పడింది.

సభ ప్రారంభానికి ఇంకా కొంత సమయం ఉంది. హైదరాబాదు నిజాం కాలేజ్ గ్రౌండ్ నిండిపోయింది. ఇసకేస్తే రాలని తొండలు. రాష్ట్రం నలుమూలలనుండి అన్ని వయసుల తొండలు మొదటిసారిగా ఒకేచోట కలుసుకున్నాయి. అసలు చరిత్రలో ఇలాంటి ఘట్టం చూడలేదని తమకు తాము ఆహ్లాదంగా మాట్లాడుకున్నాయి.

ఇంత "తొండభా" (జనాభాకు నకలు) ఉందని అనుకోలేదని చాలా వృద్ధ తొండలు వాపోయాయి. కొందరు నాయకులకు అది చూసి కొంచెం ధైర్యం వచ్చింది. ఇక తామనుకునే సమస్యలపై పోరాటం చెయ్యగలమనే ధీమా కల్గి కొందరు సభాప్రాంగణంలో కొత్త పరిచయాలు, కొత్త పలకరింతలు, విచిత్ర వస్త్రధారణలతో వచ్చిన తొండలతో "తోకచాలన" (కరచాలనకు నకలు) చేసుకున్నారు.

నగరంలోని తొండల సంఖ్య తక్కువ. జిల్లాల నుండి, గ్రామాల నుండి వచ్చిన తొండలే ఎక్కువగా ఉన్నాయి. ఎక్కువ బలంగా కూడా ఉన్నాయి. "కుళ్లిన పండ్లు, మున్సిపాలిటీ దోమలు తప్ప మీలాగా రకరకాల పురుగులు మాకేడ దొరుకుతాయని" ఒక నగర తొండ పక్కనున్న ఊరు తొండతో వాపోయింది.

యువక తొండలు గ్రౌండంతా కలెదిరిగాయి. యువతుల తొండల ప్రాంగణం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు నిర్వాహకులు. దాని చుట్టూతా యువక తొండలు అనేక ప్రదక్షిణలు చేస్తున్నాయి.

"తొండల రాజా
ఓ చందా మామా
నీ బాధలన్నీ తెలిసాయి
ఓ చందా మామా
నా చందా మామా!"

స్టేజీ మీద గాయక తొండలు నాట్యబద్ధంగా పాటలు పాడుతున్నాయి.

"గెంతరా గెంతరా
తొండ వీర గెంతరా!"


అంటూ యువక తొండలకు ఉత్తేజాన్నిస్తూ పాటలు.

రావాల్సిన ముఖ్యమైన నాయకులు వస్తున్నట్టు ఒక సీనియర్ తొండ గొంతు సవరించుకొని మాట్లాడింది.

మన ఊరు నుండి వచ్చిన బాల తొండకు చాలా సేపటి నుండి బోర్‌గా వుంది. హైదరాబాద్ చూడాలని, అక్కడి అందమైన తొండల్ని చూడాలి, అక్కడి విచిత్ర కీటకాల్ని ఆరగించాలని ఆరాటపడింది. కానీ అదేమీ జరగలేదు. విసిగిపోయింది. "అయ్యో! ఆకలైతుందే" అంది. "కాసేపుండు మీటింగైనాక పురుగులు పెడతానన్నారు, తిందువు గాని" తండ్రి తొండ సమాధానపరిచింది. స్టేజి మీదికి చూసింది. ఇంకా నాయకులు రానేలేదు. ఆకలి దంచేస్తుంది. గ్రౌండు కాంపౌండ్ చుట్టూతా ఉన్న చెట్లమీదికి దృష్టి మళ్లింది.

"అయ్యో! ఆ చెట్లమీదికి పొయ్యస్తనే! ఆకలి





ఊరుకుంట లేదు" అంది దీనంగా.

తండ్రి తొండకు జాలేసింది. ఎటన్న పోతే మళ్లీ రావటానికి కొత్తాయెనని ఆలోచించింది.

"మళ్లీ నేనొస్తలే అయ్యా! గా చెట్టుమీదికి పోతానని" అటు చూపించింది.

"సరే పో!' అంది తండ్రి తొండ.

** ** **

సభ ప్రారంభమైంది.

రంగు రంగుల దుస్తుల్లో నాయకులు వేదికమీద తోకాడిస్తూ, తోక ముడుచుకొని, తోకను మెడపై వేసుకొని, తోకను పక్కన పెట్టుకొని, తోకను గిల్లుకుంటూ, తోకను దువ్వుకుంటూ రకరకాలుగా కూచున్నారు.

గ్రౌండంతా నిండిపోయిన తొండల్ని చూసి నాయక తొండల మతిపోయింది. ఇంతగా తమ జాతి అభివృద్ధి చెందినందుకు ఆనందాన్ని తట్టుకోలేక ఉపన్యాసాలు మొదలుపెట్టారు.

అధ్యక్షుడు ఒక వృద్ధ నాయకుడు. తన మెడ కింది ముడతల చర్మాన్ని నింపాదిగా దువ్వుకొని, "ప్రియమైన తొండలారా! మీ అందరికీ నా అభినందనలు. రాష్ట్రంలోని మూలమూలల నుండి మీరంతా ఈ సభకు విచ్చేసినందుకు మహదానందంగా ఉంది.

మీ అందరికీ తెలుసు మనం ఇక్కడ ఎందుకు సమావేశమయ్యామో! తరతరాల నుండి మన తొండల జాతికి జరుగుతున్న అన్యాయాల్ని మాట్లాడుకోవాలి. మన తొండల తడాఖా ఏమిటో పాలకులకు తెలియాలి. మన ప్రియతమ నాయకులు ఒక్కొక్కరు తమ తమ అభిప్రాయాల్ని తెలియచేస్తారు. చిత్తగించాల"ని ముగించాడు.

ఒక నాయకుడు "మహా తొండలారా! మీ అందరికీ నా నమస్కారం. ఈరోజు చాలా సుదినం. మనమందరం ఇలా ఒక్కచోట కలుసుకోవటం ఆనందంగా ఉంది.

రానురాను మనల్ని పాలకులు మరచిపోతున్నారు. మనమెవరమో కూడా తరువాత తరాల వారికి మనుషులు మన గురించి చెప్పటం లేదు. ఎలుకల్ని, పిల్లుల్ని, కుక్కల్ని గురించి చెప్పుకుంటారేగాని మన తొండల్ని పట్టించుకోవటం మానేయటం విచారకరం.

మనుషులు మన మీద కక్ష కట్టారా? అనిపిస్తుంది. తమ పిల్లల పాఠ్య పుస్తకాల్లో మన బొమ్మలుండవు. మన గురించిన పాఠం ఉండదు. ఇది అన్యాయం కాదా? అని అడుగుతున్నాను.

మనలో ఐక్యత లోపించటమే ఇందుకు కారణం. మహా తొండలారా! మనం ఏకమైపోయి ఈ అన్యాయాన్ని ఎదిరించాలి! నమస్తే! జై తొండ జాతి జైజై తొండ జాతి!"

వింటున్న తొండల్లో కలవరం. భలే విషయం చెప్పాడని తోకలతో, మూతులతో చప్పట్లు కొట్టాయి.

మరో నాయకుడు లేచాడు. పొట్ట సవరించుకున్నాడు "నా ప్రియమైన తొండలారా! వందనం! బాగా ఆనందంగా ఉంది తొండలారా! కాని కొన్ని విషయాలు తలచు కుంటే భవిష్యత్తు మనకు భయంకరమనిపిస్తుంది. ఈ మనుషులు చేసే అధ్వాన్నపు పనుల వల్ల మన తొండల జాతి సమస్తం మనుగడ లేకుండా పోయేటట్టుంది.

క్రమక్రమంగా కొట్టేస్తున్న చెట్లవల్ల, నరికేస్తున్న అడవుల వల్ల మన నివాసాలు ధ్వంసమైపోయి తలా ఓ దిక్కుకు పారిపోవాల్సి వస్తుంది. కుటుంబాలు విడిపోతున్నాయి. బతుకుదెరువు కష్టమౌతుంది. రోజంతా వేటాడినా రెండు బొంత పురుగులు కూడా దొరకని పరిస్థితి ఎదురయ్యింది.

పొట్టచేత పట్టుకొని, తిరుక్కుంట తిరుక్కుంట పట్నం వచ్చి పడ్డ తొండలకు జీవితం మరింత భారమయ్యింది. ఒకటే పొగ, విపరీతమైన ట్రాఫిక్. రోడ్డు దాటుదామంటే ఏదో వాహనం కింద పడి చావాల్సిందే.

ఒక చెట్టు నుండి మరో చెట్టు మీదికి పోవాలంటే ఎంత కష్టమో ఆలోచించండి. కక్కలేక మింగలేక ఎక్కడున్న తొండలు అక్కడే ఏవో ఆకుల్ని నములుకుంటూ, ఎండుకుంటూ గడపాల్సి వస్తుంది.

ఇంక ముందు ముందు నగరాల్లోని తొండలకు మరింత కష్టం. పార్కుల్లో, చౌరస్తాల్లో క్రోటన్ల మీద మనకేం ఆహారం దొరుకుతుంది? మిత్రులారా! చెట్లు కొట్టేసిరి, పెద్ద పెద్ద అపార్టుమెంటులు కట్టిరి. తినీ తినక వదిలేసిన వాళ్ల ఆహారం మనకు పడదాయె. ఎట్లా? ఆలోచించండి!

'తొండల వనం' ప్రత్యేకంగా ఒకటి ఏర్పాటు చేయాలని నేను కోరుకుంటున్నాను.

ప్రభుత్వంపై వత్తిడి చేసి మనం అన్ని వసతులు గల 'తొండల వనం' కోసం కృషి చేయాల్సిందిగా మనవి చేస్తున్న. జై తొండ జాతి! జైజై తొండజాతి!!

తొండల్లో మళ్లీ కలవరం. ఈ నాయకుని ప్రతిపాదన అందరికీ నచ్చింది. ఆహా! అని చప్పట్లు చరిచారు.

స్టేజి మీద మంచి యవ్వనంలో ఉన్న నాయకుడు మైకు ముందుకు వచ్చీ రాగానే "జై బోలో తొండల జాతికి" అన్నాడు. అన్ని తొండలు ముక్తకంఠంగా తొండల జాతికి 'జై' చెప్పాయి.

ఈ యువ తొండ నాయకుడు 'జై' చెప్పగానే గ్రూపులోని తొండలు 'జై' చెప్పాయి. సద్దుమణిగింది. ఏం చెప్తాడా అన్నట్టు ఎదురుచూస్తున్నాయి. ఆ నాయకుడు బాగా మాట్లాడగలడని తెలిసిన తొండలు నిక్క బొడిచి వింటున్నాయి.

ఓ క్షణం మౌనం తర్వాత యువతొండ వేదికమీది వృద్ధ తొండలకు నమస్సులు చేసి తొండవాహిని వైపు తోక వూపి "నా ప్రియమైన తొండల్లారా! అభినందనలు.

మీకు నేను రెండు విషయాలు వివరంగా చెప్పదల్చుకున్నాను. ఒకటి- అంతరించి పోతున్న మన తొండల జాతిని అభివృద్ధి

**సభ ప్రారంభానికి ఇంకా కొంత సమయం ఉంది. హైదరాబాదు నిజాం కాలేజ్ గ్రౌండ్ నిండిపోయింది. ఇసకేస్తే రాలని తొండలు. రాష్ట్రం నలుమూలలనుండి అన్ని వయసుల తొండలు మొదటిసారిగా ఒకేచోట కలుసుకున్నాయి. అసలు చరిత్రలో ఇలాంటి ఘట్టం చూడలేదని తమకు తాము ఆహ్లాదంగా మాట్లాడుకున్నాయి.**

చేసుకోవాలి. ఎలా అంతరించిపోతుందో ఆలోచించారా మీరు? దాని వెనక మనకు ఎంతటి అన్యాయం జరుగుతుందో తెలుసుకున్నారా?

రైతులు విపరీతమైన క్రిమిసంహారక మందుల్ని వాడటం వల్ల, మందులపైన నియంత్రణ చేసుకోలేని మనుషుల చర్యల వల్ల మనం తీవ్రంగా నష్టపోతున్నాం.

పొలాల వెంట, గట్లవెంట పురుగులు-క్రిములన్నీ విషపూరితమై పోతున్నాయి. వాటిని తినడం వల్ల మన తొండల జాతి అనారోగ్యం పాలై అంతరించిపోతుంది.

మనకు పూర్వ కాలంలో ఎన్ని రకాల క్రిములు దొరికేవి. మన పెద్దల నడిగితే వాటిని వివరిస్తారు. ఇప్పటి యువతరానికి అవేమీ తెలియవు. ఒక్కోసారి గడ్డి తినాల్సి వస్తుంది.

పురుగుల మందుల వాడకం ఒక రకంగా మన వినాశనానికి దారి తీస్తుంది. నీళ్ల లేక, వానలు రాక మనుషులు బతుకుతెరువు కోసం పట్నం వైపుకి వలస పోతున్నారు. ఉన్న కొద్ది మంది ఇట్లా పురుగుల మందుల్తో మన ఆహారాన్ని నాశనం చేస్తున్నారు. ఆకలి కోసం తొండల జాతి అలమటించిపోతుంది.

ఇక రెండో విషయం ఇది చాలా ముఖ్యమైంది. చరిత్రలో మన మనుగడని తప్పుగా అర్థం చేసుకొని మనమీద బురద చల్లిన అంశం ఒకటుంది.

కాసేపాగి తొండ నాయకుడు అంతటా కలియచూసి "మిత్రులారా! జాగ్రత్తగా వినండి. దీన్ని మనమందరం ఆలోచించాల్సిన అవసరం ఉంది."


సభా ప్రాంగణం నిశ్శబ్దంతో ఉంది. మళ్లీ నాయకుడు...

ఈ భూమ్మీద ఎవ్వరికీ జరగని అవమానం మనకి జరిగింది. మిత్రులారా! మన తొండల జాతిమీద కుట్రతో తమ లోపాల్ని దాచుకొని తమ మచ్చలు ఎక్కడ బయట పడతాయోనని ముందే ఎదుటి వారి మచ్చల్ని వేలెత్తి చూపే మనుషులు మనల్ని కించపరిచారు.

ఈ భూమ్మీద క్రిమికీటకాల నుండి పెద్దపెద్ద ఏనుగుల దాకా కూడా బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం అనే మూడు అవస్థల్ని గడుపుతాయి. మనమూ అంతే కదా! కానీ మనమీద మాయని మచ్చ వేశారు. చెరగని ముద్ర వేశారు. 'తొండ ముదిరి ఊసరవెల్లి అవుతుందని' దుర్మార్గపు అసత్యాన్ని ప్రచారం చేశారు. మనల్ని తరతరాలుగా కించపరిచారు.

ఊసరవెల్లి జాతి వేరు. మన జాతి వేరు. ఇక మనం సహించేది లేదు. మనం ముక్త కంఠంతో తొండ ముదిరితే ఊసరవెల్లి కాదని తేల్చి చెప్పాలి. చెప్పండి ఈ సభా ముఖంగానే.

'తొండ ముదిరితే ఊసరవెల్లి కాదు'



'తొండ ముదిరితే ఊసరవెల్లి కాదు'

దిక్కులు మార్మోగేటట్టు తొండలు ముక్త కంఠంతో స్పందించాయి.

ఓ గొప్ప నిజాన్ని తెలుసుకున్న ఉత్సాహం తమపై జరిగిన అన్యాయం ఆ అరుపుల్లో ధ్వనించాయి. ఇంకా ఆ నాయకుడు-

"మిత్ర తొండలారా! మీకు కొన్ని సత్యాలు చెప్తాను. గూండాలు ముదిరి రాజకీయ నాయకులౌతారు. సినిమా యాక్టర్లు ముదిరి మంత్రులౌతారు. పోలీసాఫీసర్లు ముదిరి ప్రజా ప్రతినిధులౌతారు. దొంగ స్వాములు ముదిరి పుణ్యపురుషులౌతారు. కాని తొండ ముదిరి ఊసరవెల్లి కాదు, కానేకాదు. కుతంత్రపు పనులకు ఉపయోగించబడే ఆ వాక్యాన్ని నిషేధించాలి.

*మిత్ర తొండలారా! మీకు కొన్ని సత్యాలు చెప్తాను. గూండాలు ముదిరి రాజకీయ నాయకులౌతారు. సినిమా యాక్టర్లు ముదిరి మంత్రులౌతారు. పోలీసాఫీసర్లు ముదిరి ప్రజా ప్రతినిధులౌతారు. దొంగ స్వాములు ముదిరి పుణ్యపురుషులౌతారు. కాని తొండ ముదిరి ఊసరవెల్లి కాదు, కానేకాదు. కుతంత్రపు పనులకు ఉపయోగించబడే ఆ వాక్యాన్ని నిషేధించాలి.*

చరిత్రలో మనకు జరిగిన ఈ అన్యాయాన్ని అందరూ తిరస్కరించాలి. ఎవరూ ఈ వాక్యాన్ని ప్రయోగించకుండా నిరోధించాలి. ఎక్కడ ఈ వాక్యం మన చెవిన పడ్డా వ్యతిరేకించాల్సిందిగా కోరుతున్నాం.

ఇంతకుముందు మాట్లాడిన పెద్దల అంశాలను కూడా పరిశీలనతో సమగ్రమైన మన వాదనల్ని, కోరికల్ని, పాలకులకు తెలిపి న్యాయం కోసం పోరాడుదామని తెలుపుకుంటూ" ముగిస్తున్నాను.

సభలోని తొండలన్నీ హర్షధ్వానాలతో చప్పట్లు చరిచాయి. తోకలు గాల్లోకి రెపరెపలాడించాయి.

మన బాల తొండ, తండ్రి వద్దకు చేరింది. 'ఏం జరిగిందయ్యా! ఇంత లొల్లి?' అని అడిగింది.

'గొప్ప గొప్ప మాటలు వినకుండా ఎక్కడ బోతివిరా? తిండి దొరికిందా?

'ఏం లేదయ్యా! ఆ చెట్ల మీద దోమలు తప్ప ఏమీ లేవు. ఏదైనా వెరైటీ దొరుకుతుందని ఆశపడ్డాను" అంది బాల తొండ. "హైదరాబాదులో ఉండేవి దోమలు. దొరకనివి నీళ్లు" నీకు తెలియదు. ఇప్పటికైనా తెలుసుకో. కాసేపాగితే నిర్వాహకులు పురుగులు పెడతారు ఉండు" అని ఊరడించింది తండ్రి తొండ.

ఇంకాసేపు ఇద్దరు ముగ్గురు నాయకులు మాట్లాడాక సభ ముగిసిందని ప్రకటిస్తూ ముగింపుగా తొండ వాహినికి "మహా తొండలారా! నిధుల కొరత వల్ల, కరువు వల్ల మీ అందరికీ ఆహారాన్ని అందించలేకపోయాం. కనీసం మంచినీళ్లన్నా అందించలేకపోయాం. మనుషులే ఈ నగరంలో నీళ్లకోసం సాగరం నుండి పైపులు తవ్వుకొని ఆనందిస్తున్నారు. మరో దశాబ్దానికి గాని దాహం తీరవచ్చు. వాళ్లతో నిమిత్తం లేకుండా ముందు ముందు జరగబోయే సభలకు ఇట్టి ఇబ్బందులు జరగకుండా చూసుకుంటామని, స్వయంగా తొండల నాయకులు వీటి గురించి శ్రద్ధ తీసుకుంటారని మనవి చేస్తున్నాం.

జై తొండజాతి! జై జై తొండ జాతి!!"

బాల తొండ తండ్రి తొండ తోక పట్టుకొని తాము వచ్చిన లారీవైపు కదిలింది.

ఇత్తెరంగున తొండల మహాసభకన్నుల పండుగగా ముగిసెన్. •